www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024



పది టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



మాట్లాడుతున్న సిఐ మహమ్మద్ అలీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : పట్టణ శివారులోని మన్నూరు వద్ద కడప - తిరుపతి ప్రధాన రహదారిలో సోమవారం రూరల్ సిఐ మహమ్మద్‌అలీ పది టన్నుల ప్రభుత్వ రేషన్ బియ్యం తరలించే మినీ లారీ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. పది టన్నుల రేషన్ బియ్యం కలిగిన మినీ లారీ వాహనంతో పాటు డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు, అలాగే డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం ఖరీదు సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అన్నారు. ఎవరైనా రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అక్రమ కట్టడాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే సహించేది లేదని రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి మండల పరిధిలోని ఎగువఅబ్బవరం దళితవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో భూ ఆక్రమణలు, అక్రమ కట్టడాలు గతంలో అధికంగా ఉండేవని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలకు అతీతంగా భూ ఆక్రమణలను నివారించి పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు. కొంతమంది ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా అప్రూవల్ లేకుండా ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్లు కడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గతంలో రాయచోటి పట్టణం మాండవ్య నదిని ఆక్రమించుకొని బిల్డింగులు కట్టారని తెలిపారు. కొంతమంది బఫర్ జోన్ కూడా వదలకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి భవనాలు కట్టడం విడ్డూరమని, ఇప్పుడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చాలామంది పన్ను కట్టకుండా, ప్లాన్ అప్రూవల్ లేకుండా ప్రభుత్వ భూముల్లో బిల్డింగులు కడితే సహించేది లేదన్నారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే నదీ పరివాహక ప్రాంతాలలో కట్టడాలు కట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఇలా చేయడం మంచిది కాదన్నారు. వర్షాలు బాగా పడి నది ప్రవాహం అధికమై భవనాలు, అపార్ట్‌మెంట్‌లకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి..: నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వీటి పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. భూ సమస్యలను రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్య గురించి వారికి క్లియర్‌గా తెలియజేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో విఆర్‌ఒ స్థాయి నుంచి తహశీల్దార్ వరకు రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్లు తెలియజేసి సమస్య పరిష్కరించారు.

'పది' మోడల్ పేపర్స్ ఆవిష్కరణ



మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడానికి యుటిఎఫ్ మోడల్ పేపర్స్ ఎంతగానో దోహదపడతాయని మండల విద్యా శాఖాధికారులు ఎం.ఆర్.పద్మావతి, కె.నారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులతో కలసి యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎంఇఒలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన మోడల్ పేపర్స్ విద్యార్థులు చదవడం ద్వారా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడానికి ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులు ఈ మోడల్ పేపర్స్ చదివి మంచి మార్కులు సాధించాలని తెలియచేశారు. యూటీఎఫ్ పదవ తరగతి మోడల్ పేపర్స్ విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం.గోబ్రియా నాయక్, గౌరవ అధ్యక్షులు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండల ఉపాధ్యాయులు శంకరప్ప, సిఆర్‌పిలు పద్మనాభం, స్వాతి, ఎంఆర్‌సి సిబ్బంది సౌజన్య, నరసింహులు పాల్గొన్నారు.



కిశోరి వికాసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

బాలికల భవిష్యత్తుకు 'కిశోరి వికాసం'

ప్రజాశక్తి-పుల్లంపేట: కిశోరి వికాసం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాదిలాంటిదని అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ సభా భవనంలో సోమవారం అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అరవింద్, ఎఇఒ చక్రధర్ రాజు మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిక దిశగా వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది చేత కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమని తెలియజేశారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేల సమగ్రాభివృద్ధి సొంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూత నివ్వనున్నట్లు సిబ్బందికి వివరించారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటుచేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలియజేశారు. శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నైపుణ్య ఉపాధి, లింగ వివక్షత, సంపూర్ణ ఆరోగ్యం, ఆత్మ రక్షణ, నాణ్యమైన విద్య, మానవ అక్రమణ రవాణా, బాల్య వివాహాలను అరికట్టడం, లైంగిక వేధింపుల నుండి రక్షణ మొదలగు వాటి గురించి మండల అధికారులు క్షుణ్ణంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సౌభాగ్యమ్మ, ఎసిడిపిఒ సరలాదేవి, ఆర్‌ఐ సుశీల్ కుమార్, ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఎపిఎం సుబ్బలక్ష్మమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ మణెమ్మ, జయలక్ష్మి, నిర్మలాదేవి, మండల పరిధిలోని 71 అంగన్వాడీ టీచర్, మండల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం : మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీరబల్లి మండలం సానిపాయి గ్రామానికి చెందిన పైడి వెంకటయ్య మూడవ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత పరమేశ్వర్ మాట్లాడుతూ తమ తండ్రి 3వ వర్ధంతి రోజున వృద్ధులకు అన్నదానం చేయడం మనసుకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. ఇకపై ఆ కుటుంబంలో ఎలాంటి వేడుకల్లో జరిగిన సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అన్నదానం చేయడానికి సహకరించిన రాయచోటి లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ మహబూబ్‌బాషా, రాయచోటి అధ్యక్షులు శివారెడ్డి, వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశపు హాల్లో ఈ నెల 18, 19వ తేదీల్లో స్థానికీకరణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈ విషయాన్ని సంబంధించిన సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి తెలియబరచి శిక్షణ తరగతులకు తప్పకుండా హాజరయ్యే విధంగా చొరవ చూపాలని సూచించారు. శిక్షణా తరగతులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు.

వీరబల్లి: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధిపై ఈ నెల 17, 18వ తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తామని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ నూర్జహాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రోజుల శిక్షణ కార్యక్రమానికి వచ్చిన అధికారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామన్నారు.

చౌకదుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండలంలో ఖాళీగా ఉన్న ఆరు చౌకదుకాణాలకు డీలర్లు శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. మండలంలో రిజర్వేషన్ల వారీగా తంబళ్లపల్లి (ఎస్‌టి), వెంకట్‌రెడ్డిగారిపల్లి(బిసి-డి), రెడ్డివారిపల్లె(ఒసి మహిళ), తిమ్మఇండ్లు (బిసి-బి), చెరువు ముందర పల్లి (బిసి-బి మహిళా), గంగిరెడ్డిపల్లె (బిసి-బి) ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్ పాసై, 18-40 సంవత్సరాలలోపు స్థానికులు అర్హులని తెలిపారు. ఇంటర్ పాసైన అభ్యర్థులు లేకపోతే ఇంటర్ చదివి ఫెయిలైన వారిని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీ 10 గంటలకు రాతపరీక్ష ఉంటుందన్నారు. రాత పరీక్షలో అర్హులైన మార్పులు సాధించిన వారికి ఈ నెల 30,31 తేదీలలో ఇంటర్వ్యూ నిర్వహించి 1:15 నిష్పత్తిలో ఎంపిక చేయబడుతుందని తెలిపారు.

పగిలిన గుడ్లు గర్భిణులకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి-గాలివీడు

గర్భిణులకు, బాలింతలకు, చంటి బిడ్డలకు పగిలిన గుడ్లు ఇవ్వరాని ఐసిడిఎస్ లక్కిరెడ్డిపల్లి సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం గాలివీడులోని పకీర్‌రెడ్డి గారి పల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలనుద్దేశించి మాట్లాడారు. అంగన్వాడి కేంద్రం నుంచి పగిలిన, చెడిపోయిన గుడ్లను పంపిణీ చేయరాదని తెలిపారు. ఏజెన్సీతో మాట్లాడి నాణ్యమైన గుడ్లు, పాలు వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ, మహిళా కానిస్టేబుల్, సూపర్‌వైజర్ సోనీ, విజయమ్మ, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఓబులమ్మ, పలువురు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



గుడ్లు తూకం వేస్తున్న ఐసిడిఎస్ అధికారులు

కాంట్రాక్టు టీచర్స్‌గా మార్చాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన ఉపాధ్యాయులు, నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి సి.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో గిరిజన ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్లకార్డులు చేత బట్టి నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పదేళ్ల నుంచి విద్యార్థుల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న ట్రైబల్ టీచర్స్ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరి సరికాదన్నారు. గిరిజన ఉపాధ్యాయుల సమ్మె డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. గిరిజన ఉపాధ్యాయుల అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు నాయక్, సరోజ, హరిత మాట్లాడుతూ సాధారణంగా చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాల్లో డిఎస్‌సి నియామకాలు చేపడుతున్నారని, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని తొలగించి వారిని డిమోషన్ చేసి పార్ట్ టైం టీచర్స్‌గా మార్చే సంస్కృతి దేశంలో ఎక్కడా లేదని తెలిపారు. కేవలం ఎపిఐ ఉందని వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు టీచర్స్‌గా ప్రమోట్ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ టీచర్స్ మహదేవ్ విజయకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గీత, సుమతి, ప్రకాష్, వనిత, త్రివేణి, కల్పన, సుహాషిణి చందన, సుజాత, లావణ్య పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను బాధ్యతాయుతంగా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరుతోపాటు డిఆర్‌ఒ మధుసూదన్ రావు, కలెక్టరేట్ ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను పరిశీలించి, విచారణ చేసి పారదర్శకతతో నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్‌ఎల్‌ఎ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాన్నారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిసిటిఎ రాష్ట్ర అధ్యక్షులుగా రాఘవరెడ్డి



రాఘవరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం (జిసిటిఎ) రాష్ట్ర అధ్యక్షులుగా స్థానిక బి.టి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి విజయం సాధించారు. ఆదివారం విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన 37వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం అనంతరం జరిగిన కేంద్ర స్థాయి ఎన్నికల్లో ఆయన వరుసగా రెండవ పర్యాయం విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం బి.టి.కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనంద్‌రెడ్డి, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు. రాఘవరెడ్డి విజయాన్ని పురస్కరించుకొని కళాశాలలో కేక్ కట్ చేసి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపక సంఘానికి మన బీటీ కళాశాల నుండి ఒక రాష్ట్రస్థాయి నాయకుడు ప్రాతినిధ్యం వహించడం మనందరికీ గర్వకారణమన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ రాఘవరెడ్డి అధ్యాపక సంఘానికి అధ్యక్షులు కావడం హర్షణీయమని, సంఘం అధ్యక్షులుగా వారి హయాంలో విద్యార్థుల సమస్యలు, అధ్యాపకులు సమస్యలు పరిష్కరించబడి చక్కని విద్యావాతావరణం రాష్ట్రంలోని కళాశాలల్లో నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోనే అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు రాఘవరెడ్డిని అభినందించారు.

నేడు పింఛా నీటి సంఘానికి ఎన్నికలు

ప్రజాశక్తి-సుండుపల్లి : మండలంలోని ముడింపాడు పంచాయతీలో ఈనెల 14న నిర్వహించాల్సిన పింఛా ప్రాజెక్టు సాగునీటి సంఘానికి ఎన్నికలు దాడులు చోటు చేసుకోవడం వల్ల వాయిదా పడిందని, ఈనెల 17న నిర్వహి స్తామని ప్రాజెక్టు ఎఇ నాగేంద్ర నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు మాత్రమే వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇతరులు ఎవరూ పోలింగ్ కేంద్రానికి రాకూడదదన్నారు. ఎవరైనా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పింఛా ప్రాజెక్టు కింద భూములున్న రైతులు మాత్రమే పాల్గొన్నాలని తెలిపారు.

ఆక్రమణకు గురైన భూమిని ఇప్పించండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : వివాదాస్పదమై కోర్టు స్టే ఇచ్చిన భూమిని తమ దాయాదులు ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారని, అధికారులు స్పందించి కబ్జా కోరల నుంచి ఆ భూమిని విడిపించి తమకు అప్పగించాలని రాజంపేటకు చెందిన గుణతల చక్రపాణి పేర్కొన్నారు. సోమవారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సోదరుడు ప్రసాద్ రెండేళ్ల క్రితం మృతి చెందగా అతని పేరుపైన పుల్లంపేట మండలం శ్రీ రంగరాజుపాలెంలో ఉన్న 80, 81 సర్వే నెంబర్లలోని 68 సెంట్లు, 2.74 సెంట్ల భూమిని తన దాయాదులు అక్రమంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆ జాగా తాము 34 ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని, రెండు బోర్లు వేసి సాగు చేసుకుంటూ విద్యుత్ ఛార్జీలు కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. 30 ఏళ్ల క్రితం జాగాపై బ్యాంకు రుణం కూడా పొందామన్నారు. తన సోదరుడు మరణించిన మూడవ రోజే తమ దాయాదులు భూ ఆక్రమణకు సిద్ధమైతే పుల్లంపేట పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆ సమయంలో పోలీసులు ఇచ్చిన కౌన్సిలింగ్ మేరకు తమ దాయాదులు సద్దుమణిగారని, ఏడాది క్రితం ఆ జాగాపై కోర్టు స్టే విధిస్తే నిన్నటి దినం ఆదివారం తాము లేని సమయం చూసుకుని గుణతల సురేంద్రబాబు, విజయ్ కుమార్, చిన్న అనే ముగ్గురు తమ దాయాదులు అక్రమంగా కంచె వేసి కబ్జాకు పాల్పడ్డారని ఆవేదన చెందారు. రెండేళ్ల క్రితం వారు సదరు భూమిపై దొంగ పత్రాలు స ృష్టించి బ్యాంకు రుణం పొందారని అన్నారు. 34 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న భూమిని అక్రమంగా కబ్జా చేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి తన సోదరుడు పేరిట ఉన్న భూమిని తన వారసుడైన తన పేరు మీద మార్చి కబ్జా కోరల నుంచి విడిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు చిట్లూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని చిట్లూరు కస్పా శివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం టిడిపి మండల నాయకులు గాలివీటి సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి కార్యకర్తలు పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శిబిరంలో కిడ్నీ, ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులకు వైద్యం చేస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని రామాపురం , వీరవల్లి, లక్కిరెడ్డిపల్లి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డ్, దీర్ఘకాల వ్యాధికి సంబంధించిన రోగులు వారి వద్ద ఉన్న రిపోర్టులు తీసుకురావాలన్నారు. సమావేశంలో టిడిపి కార్యకర్తలు దేవదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న డివిఎంసి సభ్యులు

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటి సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బృందం సోమవారం తహశీల్దారు ఎం.భీమేశ్వర్‌రావును కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచనల మేరకు మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రతి నెలా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టి ప్రజల సమస్యలు తెలుసుకుని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తహశీల్దారుగా తమరు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇంత వరకు సమావేశాన్ని నిర్వహించలేదని గుర్తు చేశారు. ఫలితంగా ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు చాలా సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టి ప్రజల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరినడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున పాల్గొన్నారు.

సమాజసేవలో అమ్మ సర్వీస్ సొసైటీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజ సేవా కార్యక్రమాల్లో అమ్మ సర్వీస్ సొసైటీ ముందు వరుసలో నిలవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకాంక్షించారు. సోమవారం నీరుగట్టు వారిపల్లి అమ్మ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా 45 యూనిట్లు రక్తాన్ని దాతల నుండి సేకరించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు మడక సుబ్రహ్మణ్యం సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. నాగేశ్వర, రెడ్డిశేఖర, గణేష్, గుణశేఖర్, జయకృష్ణ 2022లో సొసైటీ స్థాపించి ఆ సంస్థ ద్వారా భవన నిర్మాణ కార్మికుల పిల్లలను చదివించడం, పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడం, అనాథ ఆశ్రమాలలోని నిరాశ్రయులకు కావలసిన నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, మొక్కలు నాటే కార్యక్రమాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా పట్టణంలో సేవలందిస్తున్నారని అభినందించారు. ముమ్మందు మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామిశెట్టి నీలకంఠ, కమలమర్రి కృష్ణ, మూడవ వార్డు ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, బాలమాలి శేఖర్, ప్రభాకర్, నాయి బ్రాహ్మణ సంఘం మంజునాథ్, అమ్మ సొసైటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మానవత్వం చాటుకున్న కార్మిక నేత జమీలా

ప్రజాశక్తి-పీలేరు

అనారోగ్యంతో బాధపడుతున్న వికలాంగ యువకుడు జీవా (32)కి ముంబాయికి చెందిన కార్మిక సంఘ నాయకులు డాక్టర్ జమీలా బేగం ఆలంబనగా నిలిచారు. ముంబాయి నుంచి పీలేరులో తన పుట్టింటికి వచ్చిన జమీలా బేగం వివిధ మాధ్యమాల ద్వారా అనారోగ్య బాధితుడు జీవ పరిస్థితిని తెలుసుకుని మానవతా దృక్పథంతో స్పందించారు. సోమవారం పీలేరు సిఐ యుగంధర్, తహశీల్దారు భీమేశ్వరరావులను కలసి ప్రభుత్వపరంగా తగిన సహాయ, సహకారాలు అందివ్వాలని కోరారు. తన వంతు బాధ్యతగా బాధితుడి వైద్యం కోసం ఆర్థిక సాయం కూడా చేశారు. తహశీల్దారు, సిఐ బాధితుని అన్న మూర్తి, వదినలను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, అతని బాధ్యతలు వారికి అప్పగిస్తూ వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం బాధితుడు జీవాను 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి వైద్యంతో పాటు కృత్రిమ కాలు సమకూర్చడం ద్వారా తన కాలకృత్యాలు తానే చేసుకునే అవకాశం ఉంటుందని, వికలాంగుడిగా సామాజిక పెన్షన్ సౌకర్యం కూడా అతనికి కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు చెప్పారు. కార్మిక సంఘ నాయకురాలు డాక్టర్ జమీలా బేగం బాధితునికి అండగా నిలిచి, సహాయం అందించడాన్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నా, విఆర్ఒ బాధితునికి అన్ని విధాలా సహకారం అందించారు.

పేద విద్యార్థుల కోసం కళాశాల ఏర్పాటు

- సమితి మాజీ ప్రెసిడెంట్ మల్లు శివారెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని అక్కంపల్లి సమీపంలో బైరాగుట్ట ఎదురుగా తన సొంత నిధులతో పేద విద్యార్థుల కోసం కళాశాల ఏర్పాటు చేస్తున్నామని సమితి మాజీ ప్రెసిడెంట్ మల్లు శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి పేద విద్యార్థులు ఎంతో ఖర్చులు పెట్టుకొని రాయచోటి, కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూలీ నాలీ చేసుకుని తమ పిల్లలను అంతదూరం పంపించి చదివించాలంటే తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. అలాంటి పేద విద్యార్థుల కోసం తమ సొంత నిధులు ఖర్చుపెట్టి కళాశాల నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు సరిపడ అధ్యాపకులను, అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. లక్షలు వ్యయం చేసి కళాశాలను నిర్మిస్తున్నామని, పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉంటే తమకు ఆనందమన్నారు. అలాగే సాయిబాబు ఆలయం వద్ద ప్రతి శనివారమూ పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్‌సిఆర్ కల్యాణమండపం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో తాను రాయచోటి సమితి అధ్యక్షులుగా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ప్రజా సేవే తనకు ముఖ్యమని మల్లు శివారెడ్డి వెల్లడించారు.

కుటుంబానికి చిరు సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బియ్యం బస్తాను అందజేస్తున్న దాతలు

కుటుంబ యజమానిని కోల్పోయి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న తల్లీ, కుమారుడికి రిటైర్డ్ అధ్యాపకులు నిజాముద్దీన్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ స్వెటర్ శారద సందర్శించి చిరు సాయం చేసి ఆదుకున్నారు. పట్టణంలోని అమ్మినేని వీధికి చెందిన భాస్కర్ బార్బర్ షాప్ నిర్వహిస్తూ జీవనం చేసేవాడు. ఇటీవల అతను అనారోగ్యంతో మృతి చెందడంతో భార్య, కుమారుడు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో శారద స్పందించి రిటైర్డ్ అధ్యాపకుడి సహకారంతో భాస్కర్ కుమారుడు మంజునాథ్‌కు తాత్కాలికంగా బియ్యం ప్యాకెట్‌ను అందజేసి ఆదుకున్నారు. భవిష్యత్తులో మరింత సహాయం చేసేందుకు తమ సిద్ధంగా ఉన్నామని వారికి తెలిపారు. మంజునాథ్ వారిరువురికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి-కలికిరి

ప్రత్యేక ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ భానుమూర్తి రావు తెలిపారు. మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగు ఆధార్ సేవలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 17, 18వ తేదీల్లో ఇంద్రమ్మ కాలనీ, గడి, గుండ్లూరు అంగన్వాడీ కేంద్రాల్లో, 19, 20వ తేదీల్లో మరికుంటపల్లి, అద్దవారేపల్లి అంగన్వాడీ సెంటర్, 26,28 తేదీలలో మహల్ అంగనవాడి సెంటర్, మున్నోలపల్లి, కలికిరిరెడ్డివారిపల్లి అంగనవాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పేరు, సెల్ నంబర్లు మార్పిడి, సెల్ నంబర్లు నమోదు, పుట్టిన పిల్లలకు ఆధారకార్డు తీయడం, 4 సంవత్సరాలు దాటిన వారికి ఆధార్ అప్డేట్ చేయడం, చిరునామా మార్పు వంటి సమస్యలను మండలంలోని ప్రజలు ఆయా సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆర్అండ్‌బి డిఇ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. రాయచోటి శివారు ప్రాంతమైన గాలివీడు రోడ్డులో ఉన్న అబ్బవరం గ్రామంలో సర్వే నెంబర్ 50లో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్బవరం గ్రామంలో సర్వేనెంబర్ 50లో ఓ ప్రయివేట్ వ్యక్తి తన హద్దుకు మించి నిర్మాణాలను చేపడుతున్నారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఫిర్యాదు మేరకు తాము, రెవెన్యూ సిబ్బంది కలిసి సర్వే చేయించామన్నారు. పరిధికి మించి నిర్మించడంతో త్వరలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని డిఇ తెలిపారు. ప్రజలు ఎవరైనా తమ పరిధికి మించి నిర్మాణాలు చేపట్ట రాదని, అలా కాదని అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా వాటిని తొలగిస్తామని హెచ్చరించారు.

18 నెలలుగా పింఛను కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-పుల్లంపేట



నిరసన తెలుపుతున్న రాజమ్మ

వితంతు పింఛను రావాలంటే అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సిందేనా! మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏరికల రాజమ్మ తన భర్త చిన్న గంగయ్య 18 నెలల క్రితం చనిపోయారు. అప్పటి నుంచి తన భర్త డెత్ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని తిరగని ఆఫీస్ లేదని, ప్రతి అధికారి చుట్టూ తిరిగానని తనకు మాత్రం ఇప్పటి వరకు వితంతు పింఛను మంజూరు కాలేదని తన బాధను మండల ప్రజా పరిషత్ భవనం బయట కూర్చుని రాజమ్మ తన బాధను వెల్లబోసుకుంది. మండల అధికారులు స్పందించి రాజమ్మకు వితంతు పింఛను వచ్చే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు. తన భర్త చనిపోయి 18 నెలలు గడిచినా కూడా తనకి వితంతు పింఛను ఇవ్వకపోవడం పట్ల రాజమ్మ నిరసన వ్యక్తం చేశారు.

భూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : మంత్రి



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరెడ్డిగారి పల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు భూ సమస్యలపై ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నందున ప్రతి మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యలను ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి : ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంత్రి నూతన మోటారు బిగించి పాఠశాలకు శాశ్వత నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను తమ కన్నబిడ్డల్లా చూసుకొని మంచి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. చిన్నమండెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నీటి సమస్య కాలం నుంచి ఉండేదని బోరు వేసి మోటార్ బిగించి పాఠశాలకు శాశ్వత నీటి సమస్య పరిష్కరించామని పేర్కొన్నారు. మంత్రి పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, తదితర సమస్యలపై మంత్రివర్యులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

సచివాలయంలో మంత్రి తనిఖీ : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తుంటారని, సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో నూతన బోరును ప్రారంభించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - వీరబల్లి

సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ కళ్లేవాండ్లపల్లిలో విఒఎ గ్రూపు సభ్యులకు సేంద్రియ వ్యవసాయంపై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విఒఎ వీరాంజనమ్మ గ్రూపు సభ్యులకు ఘనజీవామృతం తయారుచేసి చూపించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నారాయణ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైందని, దీని వల్ల భూమి నిస్సారమై ప్రతి ఏడాది దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయని చెప్పారు. పంట ఉత్పత్తుల్లో క్రిమినాశిని అవశేషాలు వెలుగు చూస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని చెప్పారు. ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరంలేని ప్రకృతి వ్యవసాయం దేశవ్యాప్తంగా కాంతులీనుతోంది. దేశీయ ఆవుల పేడ, మూత్రాలతో జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ ఎరువులను తయారుచేసి, సాగులో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. పంచగవ్య పిచికారితో పంట ఆరోగ్యంగా పెరగటంతోపాటు, చీడపీడలను తట్టుకునే స్వభావం పెరుగుతుందని తెలిపారు. రైతులు తమ పొలంలో సులభంగా ఘనజీవామృతం తయారు చేసుకునే విధానం గురించి తెలిపారు. సిఆర్‌పి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం రెండు రకాలని, ఒకటి ఘన జీవామృతం, మరొకటి ద్రవ జీవామృతమన్నారు. ఆవు పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లంలతో ద్రవజీవామృతాన్ని ప్రతి 15 రోజులకోసారి తయారు చేసుకొని వాడుకోవాలని చెప్పారు. ఘన జీవామృతాన్ని అనుకూలమైన ఎండాకాలంలో తయారు చేసుకోవాలన్నారు. భూసారం పెంపుదలలో పశువుల ఎరువు, వర్మీ కంపోస్టులకు ఇది చక్కని ప్రత్యామ్నాయమని వివరించారు. ఎకరానికి ఏటా 400 కిలోలు వేస్తే చాలని, పంటలు మంచిది కూడా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జులు ధన శేఖర్, నారాయణ, న్యాయవాది రవీంద్ర, రూపా, రైతులు పాల్గొన్నారు.



ఘనజీవామృతంపై అవగాహన చేస్తున్న ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్

జీవామృతం ఘనమైన ఎరువు

ప్రజాశక్తి - గాలివీడు

జీవామృతం ఘనమైన ఎరువని మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గాలివీడు, పందికుంట, గోరాన్ చెరువు గ్రామాల్లో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతాలు వాడటం వల్ల నేలలో సారవంతం పెరిగి తేమశాతం మెండుగా ఉంటుందన్నారు. ఘన, ద్రవ జీవమృతం వాడటం వల్ల నేలలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులు మేల్కొని మొక్కలకు పోషక విలువలు అధికంగా అందుతాయని చెప్పారు. జీవన ద్రవ్యం తయారై నేల సారవంతమవుతుందని పేర్కొన్నారు. జీవామృతం మొక్కలకు పిచికారి చేయడం వల్ల పురుగులు తెగులును కూడా నివారించుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి రైతూ ఘన, ద్రవ జీవామృతాలు నేల దుక్కిలో వేసుకొని కలియదున్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ రామయ్య, డిజిటల్ నరసింహ, మండల యూనిట్ ఇన్‌ఛార్జులు నాగరాజు, వెంకటరమణ, నాగరాజు, స్వాతి, యశోదమ్మ, ఐసిఆర్‌పిలు రైతులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆర్‌టిపిపి కాంట్రాక్టు కార్మికుడు మృతి

- మృతదేహంతో బంధువులు, కార్మికుల నిరసన
- రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- రూ.15 లక్షల నగదు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తామన్న యాజమాన్యం
- ఆందోళన విరమించిన బాధితులు



మృతి చెందిన కార్మికుడు సందీప్



ఆర్‌టిపిపి మెయిన్ గేట్ వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, కార్మికులు

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

మండలంలో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌టిపిపి)లో సోమవారం ప్రమాదవశాత్తు కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని కదిరాపల్లెకు చెందిన సందీప్ (28) ఆర్‌టిపిపిలోని నాగార్జున కన్‌స్ట్రన్స్ కంపెనీలో ఫ్లయాష్ (బూడిద) విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 15 రోజులపాటు ఫ్లయాష్ ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. సోమవారం పైపులో పేరుకుపోయిన ఫ్లయాష్‌ను కార్మికులచే శుభ్రం చేయించారు. ఈనేపథ్యంలో శుభ్రం చేస్తున్న సందీప్‌పై ఒక్క సారిగా ఫ్లయాష్ మీదపడింది. దీంతో అతను ఫ్లయాష్‌లోనే కూరుకుపోయాడు. గుర్తించిన తోటి కార్మికులు బూడిదను తొలగించి బయటకు తీశారు. అప్పటికే అతను మృతిచెందాడు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబం సభ్యులు ఆర్‌టిపిపి వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబానికి అండగా ఉన్న యజమాని మృతిచెందాడని, తమకు దిక్కెవరని విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృతదేహంతో బంధువులు, కార్మికుల ధర్నా

ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుడు సందీప్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అతని బంధుమిత్రులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు మృతదేహంతో ఆర్‌టిపిపి గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌టిపిపిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు, సదరు కాంట్రాక్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ పేర్కొన్నారు. గతంలో విశాఖ, విజయనం తదితర ప్రాంతాల్లో ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు పరిహారంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇచ్చారని, అలాగే సందీప్ కుటుంబానికి పరిహారంతోపాటు ఉద్యోగం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా లో సిమెంటు, ఇతర పరిశ్రమలు కార్మికుల భద్రత గాలికి వదిలేశారు అన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన యాజమాన్యం ఆందోళన చేస్తున్న బాధితుల వద్దకు వచ్చి సందీప్ కుటుంబానికి రూ. 15 లక్షల నగదు, అవుట్ సోర్సింగ్ కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో వారు ఆందోళన విరమించారు.

తేక్వాండో శిక్షణతో మానసిక ధైర్యం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

తేక్వాండో శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరిగి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 'ఫిట్ ఇండియా' వారోత్సవాలలో భాగంగా సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను విసి, పీజీ కళాశాల ప్రిన్సిపల్, హాస్టళ్ల చీఫ్ వార్డన్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తేక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాకుండా క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినా మానసికంగా దృఢంగా ఉంటూ ముందుకెళ్లాలని పేర్కొన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుం దని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ రోజూ ఉదయం, సాయంత్రం గంటన్నరపాటూ నిపుణులు శిక్షణ ఇస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినులకు వారం రోజులపాటు ఆదనంగా పౌష్టికాహారం అందజేస్తామన్నారు. ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ అమ్మాయిలు నిత్యం ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. తేక్వాండో మిమ్మల్ని శారీరకంగా దృఢత్వాన్ని కలిగిన వారుగా తయారు చేస్తుందన్నారు. ఇది ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయ పడుతుందని నిపుణులు నాగూర్ బాబు మాట్లాడుతూ తేక్వాండో నైపుణ్యాలను నేర్పే ఒక యుద్ధ కళ అని వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారి డాక్టర్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఎఒ ప్రకాష్‌ను సత్కరిస్తున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

ఎఒ ప్రకాష్‌కు సత్కారం

ప్రజాశక్తి-నందలూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విజయవంతంగా విధులు నిర్వర్తించి డిప్యూటేషన్‌పై కమలాపురానికి వెళ్తున్న మండల పరిషత్ ఎఒ అనంత ప్రకాష్‌కు ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, మండల సిబ్బంది సోమవారం ఘనంగా సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ సుజాతమ్మ, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్, కాంట్రాక్టర్ నడివీధి సుధాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జి డిగ్రీ కళాశాలలో విజయ్ దివస్ వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

1971లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో మనాదేశం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం నిర్వహించే విజయ్ దివస్ కార్యక్రమాన్ని పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయతా భావంతో నిర్వహించారు. జాతీయ కేడెట్ కోర్ (ఎన్‌సిసి) యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకరరెడ్డి విజయ్ దివస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. భారత సాయుధ దళాల త్యాగాలను గౌరవించడంలో ఈ దినోత్సవం కీలకమన్నారు. దేశ బలానికి పునాదైన దేశభక్తి, ఐక్యత, సమగ్రత వంటి విలువలను యువతలో నూరిపోస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణయ్య మాట్లాడుతూ విజయ్ దివస్‌ను గుర్తు చేసుకోవడం, వీరజవాన్ల త్యాగాలను స్మరించుకోవడం మన అవసరమని వివరించారు. 1971 యుద్ధంలో వీరుల ధైర్య, సాహసాలు, త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ఈ తరం జాతి నిర్మాణంలో తమ పాత్రను పోషించడం అవసరమని అన్నారు. వీర జవాన్లకు నివాళులర్పిస్తూ విద్యార్థుల కర్తవ్యస్మరణ పాటలు, ప్రసంగాలు, ఉపన్యాసాలు కార్యక్రమంలో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపులో భాగంగా జాతీయ ఐక్యతను కాపాడటానికి, జాతి సేవకు మన వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబును సోమవారం రాయచోటిలో నిమ్మనపల్లి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన, పార్టీ కోసం అక్రమ కేసులు సైతం ధైర్యంగా ఎదుర్కొన్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి పార్టీలో సముచిత స్థానాన్ని కల్పించాలని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం మండలంలో నైర్యాసం చెంది ఉన్నారని వివరించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో కనపడని వారు ఇప్పుడు పార్టీలో చలామణి అవుతుండడంపై కొంత అసహనాన్ని వ్యక్తం చేశారు. మునిపటిలా పార్టీ కార్యక్రమాలలో, పార్టీ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలంటే సీనియర్ నాయకులు, కార్యకర్తలను తప్పకుండా గుర్తించి, వారికి అండగా నిలబడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మాజీ ఎంపిపి మల్లికార్జున, జిల్లా టిడిపి బిసి అధ్యక్షులు లక్ష్మన్న, సర్పంచ్ మల్లప్ప, తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, బహుద నీటి సంఘం టిసి1 డైరెక్టర్ దామోదర్ రెడ్డి, నాయకులు చెంద్రాయుడు, విజయ్ పాల్గొన్నారు.

19 నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 19నుంచి మూడు రోజులపాటు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బాలుర క్రీడా పోటీలు కడప రీజినల్ స్థాయిలో జరుగుతాయని ప్రిన్సిపల్ జింక అశోక్‌బాబు తెలిపారు. జిల్లాస్థాయిలో 20 గవర్నమెంట్, ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 384 మంది బాలురు వివిధ రకాల క్రీడల్లో పోటీ పడనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది పోస్టర్లను విడుదల చేశారు.

ఎస్‌ఆర్‌ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వైజాగ్‌కు చెందిన ప్రముఖ కంపెనీ టాలెంట్ ల్యాబ్ బ్రింగ్ సక్సెస్ టుగెథర్ బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఎంబిఎ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ తెలిపారు. కళాశాలకు చెందిన వినయ్‌కుమార్, సంధ్య, సైఫుల్లా, దినేష్, గిరి, కౌసర్ నయీమ్, శరణ్య, అజీజ్ మహ్మద్, షేక్ గైబున్నీసా, షేక్ అబ్దుల్లా ఉద్యోగాలు సాధించారన్నారు. వీరికి ఏడాదికి రూ.4లక్షలు నుంచి రూ.7లక్షల వరకు వేతనం ఇస్తారని టిపిఒ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరికుమార్‌రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎంబిఎ హెచ్ఒడి షబానాబి, అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కంభంవారిపల్లె

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గుండ్రెడ్డిగారిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి కలికిరిలో మెడికల్ షాప్ నిర్వహిస్తూ అక్కడే కాపురం ఉంటున్నాడు. ఆదివారం తన గ్రామమైన గుడ్రెడ్డిగారిపల్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో కలికిరికి వెళ్తుండగా మండల కేంద్రానికి సమీపంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న మలుపులో తన ద్విచక్రం అదుపుతప్పి గుంతలో పడిపోయాడు. కలికిరికి వస్తున్నానని కుటుంబ సభ్యులకి ఫోన్ ద్వారా తెలియజేసి బయలుదేరిన వాడు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేస్తే రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయక పోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వచ్చి రోడ్డు పక్కన పడిపోయిన అతన్ని గుర్తించారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఆటోనగర్ సమీపంలో కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య(71) మృతి చెందాడు. గూడూరు బాషా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని మాసాపేటకు చెందిన పాలిగిరి నాగయ్య, గూడూరుబాష ఆదివారం కడపలో నిర్వహించిన ముస్లిముల సమావేశానికి హాజరయ్యారు. తిరిగి రాత్రి టివిఎస్ ఎక్సెల్ స్కూటీపై రాయచోటికి బయలు దేరారు. రామాపురం మండలం ఆటోనగర్ వద్దకు రాగానే స్కూటర్ బోల్తా పడింది. స్థానికులు విషయం రామాపురం పోలీసులకు తెలియజేశారు. వారు హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాలగిరి నాగయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అర్ధరాత్రి సమయంలో మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.